క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.00 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

మూడో రోజూ తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి

తెనాలి రూరల్: స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ వరుసగా మూడో రోజు తీర్పును తెలుగులో చెప్పారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వారం రోజుకో తీర్పును తెలుగులో చెప్పాలని న్యాయమూర్తి నిర్ణయించారు. ఈ మేరకు ఓఎస్ నంబరు 74/2024 కేసు గురువారం విచారణకు రావడంతో, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి తీర్పును తెలుగులో చెప్పారు.

రూరల్ ఎస్‌ఐగా ప్రతాప్ బాధ్యతల స్వీకరణ



తెనాలి రూరల్: తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ప్రతాప్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన తాడేపల్లి నుంచి తెనాలి రూరల్‌కు వచ్చారు. నూతన ఎస్‌ఐకు సిబ్బంది స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రతాప్ కుమార్ డీఎస్పీ బి. జనార్దనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా రూరల్ పోలీస్‌స్టేషన్‌లోనే పి. కోటేశ్వరరావు మరో ఎస్‌ఐగా పని చేస్తున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



తెనాలి అర్బన్: హెచ్‌ఐవీపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ, ఏఆర్‌టీ కౌన్సెలర్ రత్నకుమారి పేర్కొన్నారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు హ్యాపెన్–టీఐ సంస్థ ఆధ్వర్యంలో జెఎంజె కళాశాలలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులపై వివక్షత చూపవద్దని సూచించారు. వ్యాధి సోకిన వారు సకాలంలో మందులు వేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ జయరాజ్, నాగేంద్రమ్మ, రఫీ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలుకు మొక్కల పంపిణీ



తెనాలి: కేవలం బ్యాంకింగ్ కార్యకలాపాలతోనే సరిపెట్టకుండా సామాజిక బాధ్యతతో భారతీయ స్టేట్ బ్యాంక్ తెనాలి డివిజన్ పరిధిలో మొక్కల పంపిణీ చేపట్టిందని ఆ బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు చెప్పారు. రూరల్ మండలం అంగలకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం గులాబీ,తులసి, వేప తదితర మొక్కలను అందజేశారు. బ్యాంక్ ప్రాంతీయ పరిధిలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలుగు భాషాదినోత్సవ సందర్భంగా తమ పాఠశాలను ఎంపిక చేసుకొని మొక్కలను అందించినందులకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనూరాధ ధన్యవాదాలు తెలిపారు. తొలుత మొక్కలను అందజేసి, కొన్ని మొక్కలను నాటారు. కార్యక్రమంలో రావినూతల ప్రకాష్, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాడేపల్లి కృష్ణా కెనాల్ డిపో మేనేజర్లు ధనుంజయ, వర్గీస్, మేనేజర్ క్యూసి శశికళ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం, ఇతర ఆహార ధాన్యాలతో ఫోర్టిఫైడ్ రైస్ కేర్నల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషక లోపాన్ని నివారించవచ్చని కేంద్రం గుర్తించిందన్నారు. ఈ రైస్‌ను మహిళలకు, పిల్లలకు, బాలింతలకు చాలా అవసరన్నారు. వీరి కోసమే కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందని వివరించారు. నీళ్లతో కడిగినప్పుడు పైకి తేలియడే ఫోర్టిఫైడ్ రైస్‌ని పడవేయకుండా అలాగే ఉంచి వండినట్లయితే మంచి పోషక విలువలు లభిస్తాయని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఎం.అనూష, చీఫ్ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్ పాల్గొన్నారు.

కాపాడే చేతులనే నరికేస్తున్నారు



సైనిక వ్యవస్థ దేశాన్ని కాపాడుతుంటే ప్రజల ప్రాణాలను వైద్యులు కాపాడుతున్నారు. కరోనా, టీబీ, హైపటైటిస్, హెచ్ఐవీ వ్యాధులకు గురైన వైద్యులు, సిబ్బంది ఉన్నారు. సైనికులకు ఇస్తున్న గౌరవం వైద్యులకు లేదు. పైగా నిత్యం దాడులు పరిపాటైంది. మహిళలపై హత్యాచారాలు సాధారణమైంది. మాకు రెండు వేల సభ్యులు విమెన్ డాక్టర్స్ అసోసియేషన్ వాట్సాప్ గ్రూపుంది. దీనిలో ప్రతిరోజూ ఏదొక కేసు రిపోర్టు అవుతోంది. కాపాడే చేతులనే నరికేస్తే ఎలాగా? రేపిస్ట్ ఈజ్ ఆల్వేస్ రేపిస్ట్...వాళ్లు బతకటం దండగ. మరణశిక్ష అమలు చేయాల్సిందే ! – డాక్టర్ పావనీ ప్రియాంక, కార్యదర్శి, ఐఎంఏ, తెనాలి



దారుణాలు ఇక సహించలేం



మహిళలకు ఎక్కడుంది స్వాతంత్ర్యం అనిపిస్తోంది. రాత్రి డ్యూటీలు చేసే మహిళలకు రక్షణ లేదు. 8 గంటల పనివేళలు డాక్టర్లకు ఎందుకు లేవు. 36 గంటల డ్యూటీలేంటి ? ఇంట్లో, పని ప్రదేశంలో విధుల్లో మానసిక ఒత్తిడికితోడు శారీరక హింస ఏమిటి? ఇకపై సహించే పరిస్థితి లేదు. మద్యం, డ్రగ్స్ తీసుకునే దారుణాలకు పాల్పడుతున్నారు. అలాంటివారు బయటకొస్తే కఠిన శిక్షణ విధించాలి. రాత్రి డ్యూటీలు, పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు తగిన చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ హిమని, రేడియాలజిస్ట్, తెనాలి

వైభవంగా తెలుగు భాషా దినోత్సవం

తెనాలి: తెలుగు భాషోద్యమ సమితి నిర్వహణలో గురువారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. భాషా దినోత్సవ ప్రాముఖ్యతను సమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు వివరించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆ విశేషాలను వివరించారు. తొలుత గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులోనే లావాదేవీలు జరపాలని, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలని, సచివాలయంలో తెలుగు భాషా వికాసానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామని సాయి లక్కరాజు చెప్పారు. ఆంగ్ల భాషపై వ్యతిరేకత ఎంత తప్పో, తెలుగును మరిచిపోవడం అంతే తప్పని ప్రధానోపాధ్యాయిని మౌలబీ అన్నారు. తెలుగు భాషా పురస్కారాన్ని రావి సాంబయ్య పాఠశాల ఉపాధ్యాయిని కోడెల శ్రీపద్మకు బహూకరించారు. 'తెలుగులోనే మాట్లాడతానని, సాటివారిని తెలుగులో మాట్లాడేలా ప్రోత్సహిస్తామని, సంతకాలు తెలుగులోనే చేస్తాం' అని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సురేష్, కల్యాణి, రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్‌లో...

స్థానిక సుల్తానాబాద్ సరస్వతీ శిశుమందిర్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి రోజైన గురువారం తెలుగు భాషాదినోత్సవం నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ తెలుగు భాష ప్రత్యేకతను, గిడుగు రామమూర్తి కృషిని వివరించారు. తెలుగుభాష గొప్పదనంపై విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కోడూరు రమాదేవి, నరసింహారావు, ఆదిశేషు, శివన్నారాయణ యక్కల పాల్గొన్నారు.



సరస్వతి శిశుమందిర్‌లో భాషాదినోత్సవం

ప్రధానా చార్య రాజేంద్ర వందన సమర్పణ చేశారు.

లూథరన్ పాఠశాలలో...

పట్టణ నాజరుపేటలోని లూథరన్ ప్రాథమిక పాఠశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని పీఆర్ ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ, కవి,రచయిత ఆళ్ల నాగేశ్వరరావు, ప్రముఖ ఛాయా చిత్రకారుడు కొప్పరాజు విజయ్ పాల్గొన్నారు. తెలుగుభాష ప్రాముఖ్యతను, నిజ జీవితంలో తెలుగుభాష వాడుక ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఏవీ సుబ్రహ్మణ్యం, కె.వెంకటరెడ్డి, ఎం. నాగలక్ష్మి, జె.శశికళ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. మునిపల్లి వెంకట రఘునాథరావు వందన సమర్పణ చేశారు.

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. భాస్కర నాని అధ్యక్షత వహించారు. నటుడు, దర్శకుడు, గాయకుడు బెల్లంకొండ వెంకట్ తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం తెలుగు ప్రాధాన్యతపై గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, ఎం.వి. రఘునాథరావు, విజయలక్ష్మి, దుర్గ, సౌమిత్రి పాల్గొన్నారు.

భాష, సంస్కృతుల పరిరక్షణ అందరి బాధ్యత

తెనాలి అర్బన్: తెలుగు భాషా, సంస్కృతులను కాపాడుకోవడంతో పాటు భవితరాలకు వారసత్వంగా అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు బొల్లిముంత అమరేశ్వరరావు పేర్కొన్నారు. తెలుగు భాష దినోత్సవాన్ని కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాషల్లోనే తెలుగు సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. గిడుగు రామమూర్తి కృషి వలన నేడు వ్యవహారిక భాషగా అన్ని రంగాల్లో వీరాజిల్లుతుందని చెప్పారు. ప్రిన్సిపల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంగ్లిషు భాష మోజులోపడి యువత తెలుగును విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషను విస్మరిస్తే జాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం కళాశాలలోని తెలుగు అధ్యాపకులు డాక్టర్ తన్నీరు కల్యాణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. సాహితీ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ బొల్లిముంత శివరామకృష్ణ, అధ్యాపకులు కాకుమాను వెంకటేశ్వరరావు, ఎస్.అపర్ణ, బాలకృష్ణ, జగన్‌మోహనరావు పాల్గొన్నారు.



తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి నివాళి



వీఎస్సార్ కళాశాలలో మాట్లాడుతున్న కల్యాణ్ కుమార్

మధురమైన తెలుగు భాష

ప్రపంచంలోనే అన్ని భాషల్లో తెలుగు ఎంతో మధురమైనదని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ తన్నీరు కల్యాణ్ కుమార్, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. తెలుగు భాష దినోత్సవాన్ని కళాశాలలో గురువారం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టత ఎంతో గొప్పదన్నారు. నేటి పాలకులు తెలుగు భాషపై వివక్ష చూపడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాంచారయ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



లూథరన్ పాఠశాలలో మాట్లాడుతున్న ప్రియదర్శిని



ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో వేడుకలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తెనాలి అర్బన్: వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో చినరావూరు పార్కు వద్ద గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జ్వరాల సంఖ్య బాగా పెరుగుతోందన్నారు. పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకుంటూ, దోమల్ని నిర్మూలించాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. అనంతరం వాకర్లకు వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని తెలియజేసే కరపత్రాల్ని పంపిణీ చేశారు. సమావేశంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల

బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులంతా వేయించుకోవాలి

తెనాలి అర్బన్: బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులైన ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ సూచించారు. తెనాలి మండలం కొలకలూరు, కొల్లిపర మండలం మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్థులు, స్మోకింగ్ చేసేవారు, బీపీ మందులు వాడేవారు, టీబీ వ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులు అర్హులని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రాజా రమేష్, మున్నంగి, కొలకలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ దిలీప్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్

బాల్య వివాహాలపై అవగాహన

మంగళగిరి: బాల్య వివాహాల వల్ల అనారోగ్యం, రక్త హీనత, ప్రసూతి మరణాలు సంభవిస్తాయని డాక్టర్ పి.అనూష తెలిపారు. పట్టణంలోని ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో డాక్టర్ అనూష మాట్లాడారు. ఆడపిల్లలు 18 సంవత్సరాల లోపు, మగపిల్లలు 21 సంవత్సరాల లోపు వివాహాలు చేసుకోరాదన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాడేపల్లిరూరల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ మానస అన్నారు. గురువారం అంబేడ్కర్ కాలనీ (డైవర్స్ కాలనీ)లో బాల్య వివాహాల వల్ల వచ్చే ప్రభావాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మానస మాట్లాడుతూ కౌమార ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే ప్రభావాలపై బాల బాలికలకు అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి నెలా 4వ గురువారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్యం, రక్తహీనత, ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల్య వివాహాల నష్టాలు వివరిస్తున్న డాక్టర్ ఇందిర

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సి. ఇందిర బాల్య వివాహాల అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబరుకు లేదా 100కు సమాచారం అందించాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ వి.సుబ్బారావు, ఎంఎల్ హెచ్‌పీ స్వాతి, ఆరోగ్య కార్యకర్తలు లీల, శ్యామల, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక కోసం హెల్ప్ డెస్క్

తెనాలి రూరల్: ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను అరికట్టేలా తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకోవడం, ఇతర సమాచారం కోసం హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన తెనాలి మండలం పెదరావూరు వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదరావూరు వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్, మరో ప్రయాణికుడు గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

తాడికొండ: ఆటోలు ట్రాఫిక్‌కు అడ్డంగా నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని తాడికొండ సీఐ కె.వాసు హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో తాడికొండ ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రాజధాని ప్రాంతానికి వెళ్లే వీఐపీలు, వీవీఐపీలు, హైకోర్టు న్యాయమూర్తులు, లాయర్లు పలువురు ప్రముఖులు సంచరించే ప్రాంతం కావడంతో భద్రతాపరంగా, ట్రాఫిక్ పరంగా కొన్ని ఆంక్షలు తప్పవన్నారు. గతంలో లాగా రోడ్లపై నిలిపి అడ్డ దిడ్డంగా వాహనాలు ఉంచితే ఉపేక్షించేది లేదన్నారు. ఓ క్రమ పద్ధతిలో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లాలని సూచించారు. తాడికొండ మీదుగా వెళ్లే వాహనాల ట్రాఫిక్ పెరిగి నందున త్వరలో ఓ పార్కింగ్ ప్రాంతాన్ని గుర్తించి, అక్కడకు మార్పు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి 10, సాయంత్రం 5–8:30 గంటల మధ్య రోడ్డుపై వాహనాలు నిలుపకుండా పార్కింగ్ ప్లేస్‌లోనే ఉంచేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌ఐ సత్యన్నారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో ఉన్న కోదండ రామాలయం పక్కనే శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు వేద పండితులు దంపతులతో హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. 1955లో నిర్మించిన ఈ రామాలయంలో స్థానికంగా ఉండే చింతా శ్రీరామ్ ఆలయ పూజా, నిర్వహణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో వినాయకుడి దేవాలయాన్ని నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. చింతా శ్రీరామ్–రాంబాయి, పలగాని శ్రీకాంత్– తేజస్విని, బొర్రా మోహనరావు–ధనలక్ష్మి, పందిరి అనిల్‌కుమార్– శ్రీదేవి దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల పైనా ఆసక్తి అవసరం

తెనాలి అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో గురువారం నిర్వహించారు. భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులంతా ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. క్రీడల వల్ల జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కొనే మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- జాతీయ క్రీడా దినోత్సవాన్ని జేఎంజే మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన నాగం జ్ఞాన దివ్యను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.



నెహ్రూ నికేతన్ స్కూల్‌లో ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులు

రోటరీ ఆధ్వర్యంలో వన మహోత్సవం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వన మహోత్సవం నిర్వహించారు. పలురకాల మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పచ్చని మొక్కలను నాటి కాలుష్య నివారణకు దోహదపడాలన్న భావనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, జిల్లా ఇంటర్ క్లబ్ ఛైర్ ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, ఐటీఐ ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు, జీవీ నారాయణ, కె.ఉపేంద్ర, జాన్ కీట్స్, రాజేంద్ర ప్రసాద్, ఐటీఐ అధ్యాపకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రోటరీ సభ్యులు

ఆకట్టుకున్న విద్యార్థుల నాటిక



మంగళగిరి: తెలుగు భాష గొప్పదనాన్ని భావితరాలకు తెలియజేయాలని ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్ఞానసుందరి, రూరల్ సీఐ సీహెచ్ వెంకట్ పాల్గొన్నారు.